జగనన్న సురక్షతో అందరికీ మేలు

- యుద్ధప్రాతిపదికన ధ్రువీకరణ పత్రాల జారీ
- వినూత్న కార్యక్రమంతో సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

మచిలీపట్నంటౌన్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయం. అర్హత ఉండి ఏ కారణం చేతనైనా పథకం అందని వారు ఉంటే.. అలాంటి వారు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పథకంలో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ఏకారణం వల్ల పథకం అందలేదో గుర్తించి వారికి కావలసిన సర్టిఫికెట్లకు దరఖాస్తు చేయిస్తారు. యుద్ధప్రాతిపదికన ధ్రువీకరణ పత్రాలు వారికి ఉచితంగా అందేలా చర్యలు చేపట్టారు.

మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. కార్యక్రమం ద్వారా ఆయా డివిజన్లలోని పలు ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసిన వెంటనే జారీ చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు తహసీల్దార్ కార్యాలయానికి గతంలో పలుమార్లు తిరిగేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో తాము గంటల వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ముఖ్యంగా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను అధిక సంఖ్యలో తీసుకునేందుకు ప్రజలు ముందుకొస్తున్నారు. వీటితో పాటు కుటుంబ, రేషన్‌కార్డులో చేర్పులు, మార్పులు, ఆధార్‌కు ఫోన్ లింక్, బయోమెట్రిక్, ఐరిష్ వంటివి చేయించుకునేందుకు వస్తున్నారు. ఈ సేవలన్నీ ఉచితంగా అందుతుండటంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బోడావుల నాగ వరలక్ష్మి. దివ్యాంగురాలు. నగరంలోని 8వ డివిజన్ అరుణోదయ కాలనీలో నివాసం ఉంటోంది. ఒంటరి మహిళగా ఉంటున్న ఈమె వద్దకు ఇటీవల వలంటీర్ వచ్చి సర్వే నిర్వహించగా తనకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని నాగ వరలక్ష్మి కోరింది. వెంటనే వలంటీర్ దరఖాస్తు చేసింది. జగనన్న సురక్ష శిబిరంలో ఈ రెండు ధ్రువీకరణ పత్రాలు అందజేయడంతో వరలక్ష్మి ఆనందం వ్యక్తం చేసింది. ధ్రువీకరణ పత్రాల కోసం ఎలా దరఖాస్తు చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియని నాకు ఈ కార్యక్రమం ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందించారు. మూడో తరగతి చదువుతున్న నా కుమార్తె దీక్షితశ్రీ చదువుకు ఇవి ఉపయోగంగా ఉంటాయని ఆనందం వ్యక్తం చేసింది.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న పేర్ని కిట్టు (ఫైల్)



జగనన్న సురక్షలో పాల్గొన్న లబ్ధిదారులు (ఫైల్)

తొమ్మిది డివిజన్లలో 1303 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

నగరంలో 50 డివిజన్లు ఉండగా ఇప్పటి వరకు తొమ్మిది డివిజన్లలో జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు. తొమ్మిది డివిజన్లలో పలు ధ్రువీకరణ పత్రాల కోసం 1,459 దరఖాస్తులు రాగా వీటిలో 1303 దరఖాస్తులను అధికారులు పరిష్కరించి వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఐదో డివిజన్‌లో అత్యధికంగా 215 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సచివాలయాల వద్ద జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తు చేసుకున్న వారికి కూడా అప్పటికప్పుడే ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు.

పిలిచి మరీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు



నేను గతంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకోలేదు. పత్రాల కోసం తిరగాల్సి వస్తుందనే ఉద్దేశంతో దరఖాస్తు చేయలేదు. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకం ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని కార్యక్రమానికి పిలిచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ పత్రాలతో చిలకలపూడి పాండురంగ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న నా కుమారుడు గోకులనందకు ఉపయోగం జరుగుతుంది. స్కాలర్‌షిప్, అమ్మ ఒడి పథకాలకు ఈ పత్రాలు పనికొస్తాయి. – ఓలేటి నాగమల్లేశ్వరరావు

మహిళలు ఆర్థికాభ్యున్నతి సాధించాలి



గూడూరు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎం.విజయభారతి అన్నారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి ఆధ్వర్యంలో మల్లవోలులో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన విజయభారతి మాట్లాడుతూ పట్టాభి గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువత కోసం డ్రెస్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, గిఫ్ట్ ఆర్టికల్స్ తయారీ వంటి 23 రకాల కోర్సులు నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి కలిగిన కోర్సును ఎంపిక చేసుకుని ఉచితంగా శిక్షణ పొందవచ్చన్నారు. తద్వారా ఆర్థికంగా స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చెరువు తవ్వకంపై వివరాల సేకరణ

మండవల్లి: మండవల్లి మండలంలోని కానుకొల్లు గ్రామంలో మానవ హక్కుల వేదిక నాయకులు ఆదివారం పర్యటించారు. గ్రామంలోని 74, 75 సర్వే నంబరులో 9 ఎకరాలలో మాజీ సర్పంచ్ పుట్టి సత్యనారాయణ ఆక్వా చెరువు తవ్వకం విషయంపై పలువురు అభ్యంతరాలు తెలపడంతో వేదిక ఏపీ ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర కార్యదర్శి జి.రోహిత్ తదితరులు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్వా చెరువును డీఎల్‌సీ తక్షణమే ఆపివేయాలని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు.

క్లుప్తంగా

నేడు పెడనలో మంత్రి జోగి రమేష్ పర్యటన

పెడన: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పెడన మండలం పెనుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరుగనున్న జగనన్న అమ్మ ఒడి నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం పెనుమల్లి గ్రామ సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరవుతారని, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు పెడన మార్కెట్ యార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొంది. మధ్యాహ్నం 3 గంటలకు పెడన ఐదో సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరవుతారని, ఆయా కార్యక్రమాలకు సంబంధిత అధికారులు హాజరుకావాలని మంత్రి కార్యాలయం పేర్కొంది.

బ్రహ్మారాజుకు ఉత్తమ రైతు పురస్కారం ప్రదానం



మోపిదేవి: రైతు దినోత్సవం సందర్భంగా కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉత్తమ రైతులను శనివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సన్మానించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, వ్యవసాయ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి చేతుల మీదుగా పెదకళ్లేపల్లికి చెందిన తైలం బ్రహ్మారాజును మెమెంటో, ప్రశంసాపత్రంతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12న ఆశీల వసూళ్లకు వేలం

పెడన: పట్టణంలో మత్స్యమాంసాదుల మార్కెట్, వారపు సంత, పండ్లు, పూలు, కూరగాయల మార్కెట్‌లో రోజువారీ రుసుం వసూలు చేసుకునే హక్కుకు ఈ నెల 12న వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాట ఖరారైన తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు ఆశీలు వసూలు చేసుకునే అవకాశం ఉందన్నారు. లీజు ధరావత్తు రూ.2 లక్షలు అని, సాల్వెన్సీ విలువ రూ.10 లక్షలని కమిషనర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, దీనికి సంబంధించి పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలోని సంబంధిత సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు.


వృద్ధులకు అన్నదానం

మచిలీపట్నంటౌన్: మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిలకలపూడి రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యురాలు పుష్పాల రూప వృద్ధులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: శ్రీహరికోటలో చంద్రయాన్ -3 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు అవనిగడ్డ డిపో నుంచి శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌కు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి ఏడు గంటలకు అవనిగడ్డ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్ బయలు దేరి వెళుతుందన్నారు. రాను, పోను ఒక్కొక్కరికి రూ.2 వేలు టిక్కెట్ ధర అని చెప్పారు. నియోజకవర్గంలోని ఆసక్తిగల విద్యార్థులు, ప్రజలు తమ పేర్లను ఐదు రోజుల ముందే ఇస్రో వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 94936 10399, 76748 59427, 99636 58630 నంబర్లను సంప్రదించాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



కోడూరు: మండలంలోని పోటుమీద గ్రామానికి చెందిన పూర్ణ ఫౌండేషన్ అధినేత దివంగత కడవకొల్లు పూర్ణచంద్రరావు జయంతిని పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితంతువులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. 75 మంది వితంతువులకు రూ.25 వేల విలువ చేసే సరుకుల కిట్లను అందించారు. ముందుగా పూర్ణచంద్రరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచి కడవకొల్లు నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కామన్ సివిల్ కోడ్‌పై అవగాహన

కృత్తివెన్ను: ఉమ్మడి పౌరస్మృతి (కామన్ సివిల్ కోడ్)పై అవగాహన, ప్రత్యేక జాగృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సీతనపల్లి అయ్యప్ప స్వామి వారి దేవస్థానం వద్ద నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచార ప్రముఖ్ కాపవరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ కామన్ సివిల్ కోడ్ అవసరాన్ని తెలిపారు. పాశం శ్రీనివాస్, ఏసుబాబు, వడ్డీకాసులు, మురళీకృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 24వ డివిజన్‌లోని సామావారి వీధిలో సిమెంటురోడ్డు నిర్మాణ పనులను పేర్ని కిట్టు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ రహదారి పల్లంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి, డ్రెయిన్‌లో నీటికి ముంపుబారిన పడుతోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ సమస్యను స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. ఈ రహదారి ఎత్తు పెంచి నిర్మించాలని కోరడంతో 160 మీటర్ల మేర రూ. 9.97 లక్షలతో రహదారిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంకా అభివృద్ధి చేయని రహదారులను, దెబ్బతిన్న రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉన్న కచ్చా డ్రెయిన్లను పక్కా డ్రెయిన్లుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పలు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన డివిజన్లలో ఈ నిధులతో రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజు, ఖొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ధర్మరాజు, కార్పొరేటర్లు కట్టా కేదారేశ్వరరావు, యండ్రపాటి నాగేశ్వరరావు, పల్లి శేఖర్, ఐనం తాతారావు, రాసంశెట్టి వాణిశ్రీ, షేక్ ముంతాజ్‌బేగం, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

సలార్‌దాదాకు పరామర్శ

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదాను పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), పలువురు కార్పొరేటర్లు ఆదివారం పరామర్శించారు. ఇటీవల నేత్ర శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను కిట్టు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్లు పల్లి శేఖర్, ఐనం తాతారావు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న భౌభౌలు

కృత్తివెన్ను: పదుల సంఖ్యలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రోడ్లపై రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులపై దాడి చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అధికంగా సాగవుతున్న ఆక్వా చెరువు గట్ల వెంబడి తిరుగుతూ అక్కడ చనిపోయిన చేపలను ఆహారంగా ఇవి తీసుకుంటున్నాయి. దీని వల్ల అధికశాతం కుక్కలు జబ్బుల బారిన పడి చనిపోవడంతో పాటు, ఇవి మనుషులపైన దాడులకు తెగబడుతున్నాయి. కుక్కలు గుంపులుగా తిరుగుతూ రోడ్ల వెంబడి వెళ్లే బాటసారులను గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కృత్తివెన్నులో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

జీవామృతం తయారీపై అవగాహన

మండవల్లి: మండలంలోని కొర్లపాడు గ్రామంలో ఆదివారం జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్‌పీ సీహెచ్‌వీ రామారావు, నాగవిజయ, నాగమణి మాట్లాడుతూ కిచెన్ గార్డెన్‌లకు జీవామృతం ఎంతో ఉపయోగకరం అన్నారు. మొక్కలు ఏపుగా పెరిగి గార్డెన్ సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అధిక దిగుబడులు సాధించే వీలు కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం గ్రామంలో గ్రోత్ ప్రమోటర్ తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు చేప బెల్లం ద్రావణం తయారీ విధానం, ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి నాగవిజయ, శ్రీదేవి, ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.



జీవామృతం తయారు చేస్తున్న సిబ్బంది

చేప బెల్లం ద్రావణం ఎంతో మేలు

కైకలూరు: పంట సాగులో చేప బెల్లం ద్రావణం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్ కుమార్ చెప్పారు. కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామంలో డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజరు ఆదేశాలతో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేప బెల్లం ద్రావణం (గ్రోత్ ప్రమోటర్)పై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గౌతంకుమార్ మాట్లాడుతూ ఎకరాకు బెల్లం కిలో, చేప వ్యర్థాలు కిలో (ఎముకలు, మొప్పలు, చర్మం) కుండలో నిల్వ చేసుకోవాలన్నారు. 10 రోజుల పాటు రోజూ కర్రతో కలియతిప్పాలి. తర్వాత వడపోసి దానికి 100 లీటర్ల నీటికి 250 మిల్లీ లీటర్ల చేప బెల్లం ద్రావణం కలిపి, ఎకరం పొలంలో పంట, పొలంపై పిచికారీ చేయాలి. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మండల కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ నారాయణ, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ నజీర్‌ఖాన్, రికార్డు అసిస్టెంటు దేవీ, రైతులు పాల్గొన్నారు.



కోరుకొల్లులో చేప బెల్లం ద్రావణంపై అవగాహన కల్పిస్తున్న సీఆర్పీ గౌతమ్‌కుమార్

సాగరతీరంలో పర్యాటకుల సందడి



పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకుల రాకతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చి సందడి చేశారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో తీరానికి చేరుకున్నారు. తీరంలోని ఇసుకతిన్నెలపై సేదతీరుతూ, సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. యువకులు బీచ్ కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ ఆటలతో ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై తమ పేర్లు రాసుకొని మురిసిపోయారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట గస్తీ చేపట్టారు. సముద్ర స్థితిగతులపై పర్యాటకులకు అవగాహన కల్పించారు.

ప్రధాన రహదారి వెంట జంగిల్ క్లియరెన్స్



కోడూరు: అవనిగడ్డ నుంచి కోడూరుకు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్ వెంట ఆ శాఖాధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులను నిర్వహిస్తున్నారు. కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారి వెంట విద్యుత్ లైన్ ఉండగా.. రహదారి పొడవునా పొక్లెయిన్ల సహాయంతో ముళ్ల చెట్లు, చెట్ల కొమ్మల తొలగింపు పనులను నిర్వహించారు. విద్యుత్‌లైన్‌తో పాటు స్తంభాల చుట్టూ అడ్డుగా మారిన చెట్లను తొలగిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జంగిల్ క్లియరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డీఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

శాకంబరీదేవిగా నాంచారమ్మ



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనం ఇచ్చారు. ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా భక్తులు సమర్పించిన పలు రకాల కూరగాయలతో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ఆకుల వెంకట్రామయ్య, కూరపాటి కోటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంగానమ్మ బోనాల జాతర

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రు గ్రామంలో గంగానమ్మ తల్లి బోనాల జాతర వైభంగా నిర్వహించారు. ఉదయం నుంచి గంగానమ్మతల్లి ప్రత్యేక జలాభిషేకాలు పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత సీతాంరాజు రామారావు, సక్కు భాయి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు తలపై బోనాలు పెట్టుకుని వచ్చి అమ్మవారి జాతర పాల్గొన్నారు. సుమారు 200 మంది మహిళలు బోనాలతో ఊరు మొత్తంగా తిరిగారు. పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎల్.లక్ష్మీనారయణశర్మ విశేష పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ జాపల్లి రాజేశ్వరీ బోనాల జాతరలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు జాపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పాట కచేరీ

గుడివాడ టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో ఆదివారం సినీపాటల కచేరీ నిర్వహించారు. శ్రీలక్ష్మీ గానామృతం బృందం నిర్వహించబడిన ఈ పాటల కచేరీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు గాయకులు పాల్గొన్నారు. ఘంటసాల తరం నుంచి నేటి తరం వరకు పాడిన భక్తి, యువళ గీతాలు గానం చేశారు. కార్యక్రమంలో కళాకారుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు విన్నకోట బుజ్జి, ఆర్గనైజర్ వెంకట లక్ష్మి, సతీష్, పలువురు గాయకులు పాల్గొన్నారు.

నాంచారమ్మకు ఆషాఢ సారె సమర్పణ

కోడూరు: కృష్ణాపురం భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. గ్రామానికి చెందిన భజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సమర్పించే సారెను డప్పువాయిద్యాలు, మేళతాళాల మధ్య ఊరేగించారు. పసుపు, కుంకుమతో పాటు పండ్లు, పట్టుచీరను అమ్మవారికి సమర్పించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో మహిళలచే సామూహిక కుంకుమార్చన భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఘంటసాల జైపార్థసారథి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అమ్మవారికి సారెను సమర్పించిన భక్తులు

కార్తికేయుని ఆలయం కళకళ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో క్యూ లైన్లు నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు, సూపరింటెండెంట్ సత్యనారాయణ పర్యవేక్షించారు.

వేళంగిణి యాత్రకు ప్రత్యేక బస్సు

గుడివాడ టౌన్: క్రైస్తవులకు అత్యంత పవిత్ర స్థలమైన వేళంగిణీ మాత పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్ నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సూపర్‌లగ్జరీ బస్ బయలుదేరి 15వ తేదీ ఉదయం నాగపట్నం చేరుకుంటుందన్నారు. ప్రార్థనల అనంతరం బయలుదేరి 16వ తేదీ ఉదయం సెయింట్ థామస్ మౌంట్, మెరీనా బీచ్ ఇతర ప్రదేశాలు సందర్శించిన అనంతరం 17వ తేదీ ఉదయం గుడివాడకు చేరుకుంటుంది. టికెట్ ధర రూ. 3,600గా నిర్ణయించారు.